వచ్చే నెలాఖరుకు హోం స్టేల నిర్మాణం పూర్తి

ప్రజాశక్తి -పాడేరు:: వచ్చే నెలాఖరుకు హోం స్టేల నిర్మాణాలు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ ఎస్. దినేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ నుంచి ఎంపిడిఒలు, టూరిజం కమిటీ సభ్యులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హోం స్టేలకు గుర్తించిన గృహాలలో పర్యాటకులకు వసతితో పాటు అల్పాహారం, భోజన సౌకర్యాలు కల్పించాలన్నారు. హోం స్టేలలో రన్నింగ్ వాటర్, వాష్‌రూంలు, విద్యుత్తు, దోమల నియంత్ర ఏర్పాట్లు చేయాలని స్పష్టం చేసారు. పర్యాటకులకు హోంస్టేల ప్యాకేజీలపై ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఎంపిడిఒ, తహశీల్దార్, పోలీసులు, ఇంజనీరింగ్ అధికారులతో మండల స్థాయిలో టూరిజం కమిటీలు ఏర్పాటు చేసి గ్రామాలలో హోం స్టేల ఏర్పాట్లపై సమావేశాలు నిర్వహించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేదానికి పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో పాడిరు సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ (పర్చువల్), జిల్లా పర్యాటక అధికారి జి. దాసు, డిఆర్‌డిఎ పిడి వి.మురళి, డివిజినల్ పంచాయతీ అధికారి పిఎస్ కుమార్, సిపిఒ పివిఎల్. ప్రసాద్, ఎపిఎఫ్‌ఎసి డిఎం జి.కృష్ణబాబు, పాల్గొన్నారు.

'అల్లూరి'పై ఇంత చిన్నచూపా?

- రోడ్డు విస్తరణలో తొలగించిన విగ్రహాన్ని నిర్లక్ష్యంగా పడేయడం దుర్మార్గం
- జయంతి వేడుక ఎలా నిర్వహించాలని మన్యవాసుల ఆవేదన

ప్రజాశక్తి-చింతపల్లి: స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహం పట్ల చిన్నచూపుపై స్థానిక గిరిజనులు ఆవేదన చెందుతున్నారు. రోడ్డు విస్తరణలో తొలగించిన అల్లూరి విగ్రహాన్ని రక్షణగాఉంచాల్సిందిపోయి, స్థానిక ఆర్‌అండ్‌బి కార్యాలయం వద్ద నిర్లక్ష్యంపై పడేయడంపై స్థానికులు మండిపడుతున్నారు. ఏటా జూలై 4న అల్లూరి జయంతిని పురస్కరించుకొని రాజకీయ నాయకులు, అధికారులు విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన పరిస్థితుల్లో నేడా విగ్రహానికి కనీస సంరక్షణ లేకపోవడం, నిరాదరణకు గురికావడం స్థానికులను కలచివేస్తోంది.

జాతీయ రహదారి విస్తరణలో భాగంగా చింతపల్లిలోని అల్లూరి విగ్రహాన్ని తొలగించారు. జెడ్‌పిటిసి పోతురాజు బాలయ్య ఆధ్వర్యంలో కొత్త స్థలాన్ని గుర్తించి విగ్రహాన్ని తిరిగి ఏర్పాటు చేయాలని ప్రయత్నం జరిగినా, హైకోర్టు ఆదేశాల ప్రకారం జిల్లా కలెక్టర్ పర్యవేక్షణలో హనుమాన్ జంక్షన్ కూడలి నుంచి ప్రభుత్వ డిగ్రీ కళాశాల వరకు 100 అడుగుల మేర రహదారిని విస్తరించడంతో స్థల సమస్య తలెత్తింది. గిరిజనుల కోసం ప్రాణత్యాగం చేసిన అల్లూరి సీతారామరాజుకు ఈ విధమైన అవమానం ఎదురవుతుందా...? ఇదేనా గిరిజన స్వాతంత్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజుకు ఇచ్చే గౌరవమని పలువురు ప్రశ్నిస్తున్నారు. దీంతో రోడ్లు భవనాల శాఖ కార్యాలయం వద్దకు విగ్రహాన్ని తరలించి తాత్కాలికంగా ఉంచారు. అప్పటి నుంచి వర్షానికి తడుస్తూ, ఎటువంటి రక్షణ చర్యలు లేకుండా విగ్రహం నిర్లక్ష్యానికి లోనవుతోంది. నిర్లక్ష్యంగా మూలన పడేసిన విగ్రహానికి జయంతి రోజున పూలమాలలు వేసే పరిస్థితి రావడం విచారకమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విగ్రహానికి శాశ్వత స్థలం కేటాయించి, సక్రమంగా ఏర్పాటు చేసి సంరక్షించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

ఆర్‌అండ్‌బి కార్యాలయ ఆవరణలో నిర్లక్ష్యంగా పడేసిన అల్లూరి విగ్రహం

జిఒ 51 ప్రతుల దగ్ధం

ప్రజాశక్తి-.చింతపల్లి: ఐదవ షెడ్యూల్ భూభాగమంతా ఆదివాసులదేనని ఆదివాసీ గిరిజన సంఘం నేతలు స్పష్టం చేశారు. అనంతగిరి మండలం పెదకోట ప్రాంతంలో హైడ్రో పవర్ ప్రాజెక్టుకు అనుమతిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జిఒ 51ను నిరసనగా చింతపల్లిలో ఆదివాసులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు బోనంగి చిన్నయ్య పడాల్ మాట్లాడుతూ పీసా గ్రామసభ అనుమతి లేకుండా హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌కు ఎలా అనుమతులు ఇస్తారని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం గిరిజన హక్కులను, చట్టాలను పక్కన పెట్టి ఏకపక్షంగా జిఒ 51 జారీ చేసిందని, ఇది రాజ్యాంగ విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన ప్రాంతాల భూభాగాలపై రాష్ట్రపతి, గవర్నర్, గిరిజన సలహామండలి కమిటీకి అధికారం ఉంటుందని, గిరిజన ఎమ్మెల్యేలు కమిటీ చైర్మన్లుగా ఉంటారనిగుర్తు చేశారు. పార్లమెంట్ చేసిన చట్టాలకు ఉన్న ప్రాధాన్యతే పీసా గ్రామసభకు కూడా ఉందని, . ఈ హక్కులను అడ్డగోలుగా కాలరాసి జిఒ విడుదల చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. ఇప్పటికే గిరిజనులకు 100శాతం ఉద్యోగాలు ఇచ్చే జిఒ 3ను రద్దు చేశారని, దానికి ప్రత్నామ్నాయ చర్యలు చేపడతామని ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదని మండిపడ్డారు. 1/70 చట్టాన్ని కూడా అటకెక్కించేసి గిరిజనులకు అన్యాయం చేస్తున్నామని ధ్వజమెత్తారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుల పేరుతో అడవులను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే కుట్ర జరుగుతోందని, దీన్ని అడ్డుకుని తీరతామని హెచ్చరించారు. ఐదవ షెడ్యూల్ ప్రాంతమంతా అంతరించిపోయేలా ప్రభుత్వం చేస్తున్న కుట్రలను మన్యవాసులంతా ఏకతాటిపైకి వచ్చి ప్రతిఘటించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం జిఒ 51ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో జీకే వీధి మండల నాయకులు గడుతూరి సత్యనారాయణ, వంతల చిన్నమ్మి, రాజు, పాంగి దివ్య, దత్త కుమారి, ఎం అప్పలరాజు పాల్గొన్నారు.

జిఒ ప్రతులను దగ్ధం చేస్తున్న చిన్నయ్యపడాల్, తదితరులు

గంజాయి నిర్మూలనకు ప్రత్యేక డ్రైవ్

- అల్లూరి జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ అరకులో ప్యాసింజర్ రైలులో విస్తృత తనిఖీలు

రైల్వేస్టేషన్‌లో తనిఖీల్లో పాల్గొన్న ఎస్‌పిఅమిత్ బర్ధర్

ప్రజాశక్తి- అరకులోయ: గంజాయి సంపూర్ణ నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు అల్లూరి జిల్లా ఎస్పి అమిత్ బర్దర్ తెలిపారు. గంజాయి నిర్మూలనపై రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా అల్లూరి జిల్లా అరకులోయ రైల్వే స్టేషన్‌లో కిరండోల్ పాసింజర్ రైలును సబ్ డివిజనల్ ఫోర్స్‌తో ప్రత్యేక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విలేకరులతో ఎస్‌పి మాట్లాడుతూ, ఏజెన్సీ నుండి విశాఖ పట్నానికి గంజాయి రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నార. గతంలో మల్కనగిరి కోరాపుట్ ప్రాంతం నుంచి కిరండోల్ పాసింజర్ రైలులో గంజాయిని అక్రమంగా విశాఖకు తీసుకెళ్లి అక్కడి నుంచి ఇతర రాష్ట్రాలకు సరఫరా చేసిన సంఘటనలను దృష్టిలో పెట్టుకొని ఇక్కడ ప్రత్యేకంగా తనిఖీలు నిర్వహించమన్నారు. ప్రతి భోగిలో కూడా డాగ్ స్క్వాడ్‌ను వినియోగించి తనిఖీలు చేశామన్నారు. గంజాయి సాగుకు అలవాటుపడ్డ వారిని గుర్తించి ప్రత్యామ్నాయ పంటలు వెయించమన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గంజాయి సాగు, అక్రమ రవాణా వల్ల వచ్చే అనర్ధాలపై అవగాహన కల్పించామన్నారు.కొంతమంది అమాయక గిరిజన యువత ఈజీ మనీకి అలవాటు పడి గంజాయి అమ్మకాల్లో భాగమై పోలీసుల కేసులను ఎదుర్కొని శిక్ష అనుభవిస్తున్నారన్నారు. గంజాయి మాఫియాకు ప్రత్యక్షంగా గాని పరోక్షంగా గాని సహకరించవద్దని హితవు పలికారు. ఇకపై నుంచి ప్రతిరోజు తనిఖీలు నిర్వహిస్తామన్నారు. తనిఖీల్లో అరకు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హిమగిరి, ఎస్ఐ గోపాలరావు పాల్గొన్నారు.

డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు

రైలు భోగీల్లో సోదాలు చేస్తున్న పోలీసులు

హైవే నిర్మాణంలో నాణ్యతా లోపం!

- రోడ్డు పూర్తికాక ముందే బీటలు, పగుళ్లపై ఆందోళన

ప్రజాశక్తి -హుకుంపేట: మండలంలో నూతన జాతీయరహదారి నిర్మాణ పనుల్లో నాణ్యతపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకవైపు నిర్మాణ పనులు జరుగుతుండగా, మరోవైపు నిర్మాణ దశలోనే రోడ్డుకు పలుచోట్ల పగుళ్లు, బీటలు ఏర్పడడంపై ఆందోళన వ్యక్తమౌతోంది.

మండలంలోని కొంతిలి కాలనీ నుంచి అరకు వెళ్లే మార్గంలో, రాళ్లగడ్డ వంతెన ముందు నిర్మించిన మరో భారీ వంతెనల మధ్య రహదారి పైభాగంలో ఈ పగుళ్లు కనిపించాయి. దీన్ని గమనించిన హైవే అధికారులు, ఆ ప్రదేశంలో వాహనాలు వెళ్లకుండా చర్యలు తీసుకున్నారు. రహదారికి అడ్డంగా దిమ్మలు పెట్టి ఉక్కు బ్యారికేడ్లు ఏర్పాటు చేశారు. ప్రయాణాలను హుకుంపేట మండల కేంద్రం నుంచే అనుమతిస్తున్నారు.పూర్తికాక ముందే వాహనాలకు అనుమతేంటి? పనులు పూర్తికాకముందే వాహనాలను నూతన రహదారిపై అనుమతించడం యథార్ధమేనా అనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. రహదారి పూర్తిగా సిద్ధమైన తర్వాతే వాహనాలను అనుమతించాలి కానీ, ఇప్పటికే ఇలా బీటలు పగుళ్లు రావడంతో నిర్మాణ నాణ్యతపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి ఇప్పుడే ఇలా అయితే ముస్ముందు రోడ్డు పరిస్థితి ఏంటని ఆందోళన వ్యక్తమౌతోంది.

కాగా వర్షాల కారణంగా మట్టి కుంగిపోవడం వల్లే రహదారిపై బీటలు వచ్చాయనీ, అయితే ఇలాంటి నిర్మాణాల ముందు తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఉందనీ అభిప్రాయపడ్డారు.ప్రభుత్వ ఖర్చుతో నిర్మిస్తున్న ఈ హైవే నిర్మాణంలో ఈ తరహా లోపాలు తలెత్తడంపై పలువురు విమర్శిస్తున్నారు. దీనిపై సంబంధిత హైవే శాఖ అధికారులు, రహదారి నిర్మాణ సంస్థ, అలాగే ప్రాంతీయ పర్యవేక్షణా విభాగం వెంటనే స్పందించి పగుళ్లకు కారణాలను గుర్తించి తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

నిఆర్మణ దశలోనే జాతీయ రహదారిలో ఏర్పడిన పగుళ్లు

క్రమంగా పెరుగుతున్న వరద

- గండిపోచమ్మ ఆలయం మండపంలోకి గోదావరి నీరు
- చింతూరు మండలంలో పొంగుతున్న వాగులు

ప్రజాశక్తి-దేవీపట్నం

వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరద నీరు క్రమంగా పెరుగుతోంది. దేవీపట్నం మండలంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రం గండి పోచమ్మ తల్లి ఆలయ మండపంలోకి గోదావరి వరద నీరు ప్రవేశించింది. గురువారం సాయంత్రం సమయానికి అమ్మవారి ఆలయం మండపంలోకి వరద నీరు వచ్చి చేరిందని దేవస్థానం ఈవో లక్ష్మీకుమార్ తెలిపారు. ఇక్కడ వరద పరిస్థితులను పరిశీలించడం జరిగిందని, గోదావరి వరద ఉధృతంగానే ఉందని చెప్పారు. ఇప్పటికే అమ్మవారి ఆలయ కింది భాగంలోని సిమెంటు రోడ్డు పూర్తిగా మునిగిపోయిందని తెలిపారు. గోదావరి వరద మరింత పెరిగితే ఆలయంలోకి వచ్చే అవకాశం కూడా ఉందని ఈవో చెప్పారు. ఇప్పటికే ఆలయంలో ఉన్న హుండీలను తెరిచి, వాటిని లెక్కించినట్లు చెప్పారు. దేవస్థాన సిబ్బందిని అప్రమత్తం చేశామని, భక్తులు ఎవరు గోదావరి నదిలో దిగకూడదని హెచ్చరించినట్లు తెలిపారు.

వాగుల్లో పెరుగుతున్న నీటి ప్రవాహం

చింతూరు : వారం రోజులుగా తుఫాను కారణంగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని వాగుల్లో నీటి ప్రవాహం క్రమేపీ పెరుగుతున్నాయి. శబరి నదిలో నీరు ఎర్రగా మారింది. నది నీటిమట్టం పెరుగుతోంది. సోకిలేరు వాగు, సీలేరు నది వర్షాల కారణంగా ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పోల్లూరు జలపాతంలో నీటి ఉధృతి అధికమై బీకర శబ్దంతో పరవాళ్ళు తొక్కుతోంది. కొమ్మూరు వాగు, చంద్రవంక వాగుల్లో కూడా నీటి ప్రవాహం పెరిగింది. మరో రెండు రోజులు వర్షాలు ఇలాగే కొనసాగితే సోకులేరు వాగు పైకి నీరు వచ్చి వీఆర్.పురం -చింతూరు మండలాలకు రహదారులు మోసుకుపోయే అవకాశం ఉంది. చిడుమూరు వాగులో కూడా నీటి ఉధృతి పెరిగింది. కుయుగూరు వాగు పొంగి ప్రవహిస్తే ఒడిస్సా ఆంధ్ర రహదారి స్తంభించిపోతుంది. జులై, ఆగస్టు నెలల్లో భారీగా వరదలు వచ్చే అవకాశం ఉందని, ప్రజలను అప్రమత్తంగా ఉండాలని అధికారులు ఇప్పటికే ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. చింతూరు భద్రాచలం జాతీయ రహదారిపై ఇంకా కొన్నిచోట్ల బ్రిడ్జిలు అసంపూర్తిగానే ఉండటంతో వాహన చోదకులు ఇబ్బందులు పడే అవకాశం ఉంది. ఇప్పటికే బ్రిడ్జిల వద్ద బురద పేరుకుపోయి వాహనాలకు ఇబ్బందికరంగా మారింది. రానున్న రోజుల్లో వర్షాలకు వరదలు అధికంగా ఉంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇప్పటికే లోతట్టు ప్రాంత ప్రజలు సురక్షిత ప్రాంతాల్లో ఇళ్లను అద్దెకు తీసుకొని సామాన్లను తరలించుకుంటున్నారు.

మోతుగూడెం వద్ద భయంకరంగా ప్రవహిస్తున్న తడిక వాగు

గండి పోచమ్మ ఆలయం సమీపంలో పొంగిన గోదావరి

గోదావరి పరిసర ప్రాంతాలను పరిశీలించిన అధికారులు

దేవీపట్నం : మండలంలో గోదావరి వరద ఉధృతంగా ఉన్న ప్రదేశాలను అధికారులు గురువారం పరిశీలించారు. ఇరిగేషన్, దేవస్థాన అధికారులు గోదావరి పరివాహ ప్రాంతాలను సందర్శించారు. గండి పోచమ్మ తల్లి ఆలయ పరిసరాలలో ఉన్న వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించడంతో పాటు అమ్మవారి ఆలయం వద్ద ఉన్న వరద పరిస్థితిని అంచనా వేశారు. భద్రాచలం ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరద నీరు తగ్గుతుందని, శుక్రవారం మరింత తగ్గే అవకాశం ఉందని ఇరిగేషన్ అధికారులు చెప్పారు. వరద పరిస్థితిని పూర్తిగా పరిశీలించిన తరువాత శుక్రవారం సాయంత్రానికి అమ్మవారి ఆలయానికి సంబంధించి ఒక నిర్ణయం తీసుకుంటామని దేవస్థాన ఈవో లక్ష్మి కుమార్ తెలిపారు. వరద బాగా పెరిగి ఆలయం లోపలికి ప్రవేశిస్తే భక్తుల దర్శనాలు నిలిపివేస్తామని చెప్పారు. వరద తగ్గితే యధావిధిగా భక్తులకు దర్శనాలు ఏర్పాటు చేస్తామన్నారు.

తాడువాయి సందర్శనకు బస్సుల ఏర్పాటు

ప్రజాశక్తి-చింతూరు : చింతూరు డివిజన్ పరిధిలోని గిరిజనేతర పోలవరం నిర్వాసితులకు ఆర్ అండ్ ఆర్ కాలనీల స్థలాల కోసం తాడువాయి గ్రామంలో గతంలో భూ సేకరణ చేసి సిద్ధంగా ఉన్న భూములను చూపించడానికి బస్సులు ఏర్పాటు చేసినట్లు చింతూరు ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అపూర్వ భరత్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ కూనవరం మండలంలోని కూనవరం, టేకులబోరు గ్రామల గిరిజనేతరుల కోసం ఈ నెల 4వ తేదీన మూడు బస్సులు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కూనవరం, టేకులబోరు గ్రామల ప్రజా ప్రతినిధులు, గ్రామ పెద్దలు, మీడియా వారు తాడువాయి గ్రామాన్ని సందర్శించి వీలైనంత త్వరగా వారి అభిప్రాయం తెలియజేయాలని కోరారు. ఈ అవకాశాన్ని పైన తెలిపిన గ్రామాల గిరిజనేతరులు ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొంటారని తెలిపారు.

మాట్లాడుతున్న చింతూరు ఐటిడిఎ పిఒ అపూర్వ భరత్

ఆర్కా రిసార్ట్స్‌లో అక్రమ కట్టడాలను వెంటనే ఆపాలి

ఐటిడిఎ పిఒకు సిపిఎం వినతి

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీ ప్రాంత వెన్నెముక లాంటి 1/70 చట్టానికి, పీసా చట్టానికి విరుద్ధంగా రంపచోడవరం నియోజకవర్గ కేంద్రంలో ఆర్కా రిసార్ట్స్‌లో జరుగుతున్న అక్రమ కట్టడాలను తక్షణమే నిలుపుదల చేయాలని సిపిఎం రంపచోడవరం ప్రాంతీయ కమిటీ డిమాండ్ చేసింది. ఆర్కాలో బినామీ పేర్లతో నడుస్తున్న రిసార్ట్స్, లాడ్జి, బార్, రెస్టారెంట్‌పై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని, వీటిని నిర్వహిస్తున్న గిరిజనేతరులపై చర్యలు తీసుకొని, వాటిని గిరిజన సొసైటీలకు అప్పగించి, గిరిజనులకు ఉపాధి కల్పించాలని కోరింది. ఈ మేరకు సిపిఎం రంపచోడవరం ప్రాంతీయ కమిటీ కన్వీనర్ మట్ల వాణిశ్రీ, జిల్లా కమిటీ సభ్యులు కె.శాంతి రాజు గురువారం ఐటిడిఎ పిఒ కట్టా సింహాచలంనకు, సబ్ కలెక్టర్ కల్పశ్రీకి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రంపచోడవరం, మారేడుమిల్లి ప్రాంతంలో గిరిజనేతరులు బీనామీల ద్వారా అక్రమంగా టూరిజం, రెస్టారెంట్లు, లాడ్జిలు, రిసార్ట్స్ ఎటువంటి లైసెన్స్, పర్మిషన్ లేకుండా నడిపిస్తున్నారని తెలిపారు. పీసా చట్టం ప్రకారం ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతరులు ఎటువంటి అక్రమ కట్టడాలు చేయకూడదని, అయినా గిరిజన చట్టాలకు విరుద్ధంగా గిరిజనేతరు ఇష్టానుసారంగా నిర్మాణాలు చేస్తున్నా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోకుండా ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ప్రశ్నించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు తక్షణమే విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఐటిడిఎ పిఒకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు

రోడ్లు, తాగునీటి సమస్యపై ఐద్వా నిరసన

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని తుమ్మల గ్రామంలో రోడ్లు, తాగునీరు సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తుమ్మల సచివాలయం వద్ద ఐద్వా మండల కమిటీ ఆధ్వర్యంలో ఖాళీ బిందెలతో మహిళలు నిరసన తెలిపారు. తుమ్మల గ్రామంలో ఉన్న సమస్యలను పరిష్కారించాలను పంచాయితీ సెక్రటరీకి వినతిపత్రం అందజేశారు. రోడ్లు, డ్రెయిన్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని, తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, వీటిపై గతంలో ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు ఈ సమస్యలపై దృష్టి పెట్టి వెంటనే తాగునీరు, రోడ్ల సమస్యలను పరిష్కరించాలని కోరారు. వీరి ధర్నాకు సిపిఎం తుమ్మల గ్రామ కమిటీ మద్దతు తెలియజేసింది. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు పాత్రా నాగమణి, సోడి కృష్ణమ్మ, మడివి సుమలత, నాంపల్లి నాంచారమ్మ, ఉయిక జానకమ్మ, మొట్టం చామంతి, సోడి నందు, దులమ్మ, పాత్రా జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

తుమ్మల గ్రామ సచివాలయం వద్ద ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తున్న మహిళలు

విశాఖ డెయిరీ పాల సేకరణ కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి -కొయ్యూరు : మండలంలోని రొంగలి కొత్తూరు గ్రామంలో మండల పశువైద్యాధికారి డాక్టర్ కే.రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో విశాఖ డెయిరీ పాల సేకరణ కేంద్రం గురువారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా డాక్టర్ రాజేష్ కుమార్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం, పశుసంవర్ధక శాఖ ప్రవేశ పెట్టిన మహిళా డెయిరీ సంఘాలు కార్యక్రమంలో భాగంగా రొంగలి కొత్తూరులో పాల కేంద్రం ప్రారంభించినట్లు చెప్పారు. గ్రామానికి చెందిన 25 మంది మహిళా రైతులు ఈ డెయిరీలో పాలు పోసేందుకు ముందుకు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ డెయిరీ నుంచి రోజుకు 250 నుంచి 300 లీటర్ల వరకూ పాల ఉత్పత్తి జరిగే అవకాశం ఉందన్నారు. పాడి రైతులు సొసైటీగా ఏర్పడడం వల్ల రైతులకు ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీలు, బీమా, వైద్యం అందించడం జరుగుతుందన్నారు. గ్రామంలో డెయిరీ ఏర్పాటు చేసేందుకు సహకరించిన రొంగలి శ్రీనివాస్, ఆవుగడ్డి రామునాయుడు తదితరులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

పాల సేకరణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

పిహెచ్‌సిలో రికార్డులను పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

పిహెచ్‌సి, అంగన్వాడీల ఆకస్మిక తనిఖీలో అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్

ప్రజాశక్తి- హుకుంపేట: మండలంలోని కుల్లపాడు అంగన్వాడీ కేంద్రం, హుకుంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను గురువారం అసిస్టెంట్ కలెక్టర్ సాహిత్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా ఆయా కేంద్రాల కార్యకలాపాలపై సమగ్ర పర్యవేక్షణ చేపట్టారు. తనిఖీలో భాగంగా కుల్లపాడు అంగన్వాడీలో బాలల హాజరు, పాఠ్య కార్యక్రమాల నిర్వహణ, పోషకాహార పంపిణీ, కేంద్రం శుభ్రత, వంటగది పరిస్థితి వంటి అంశాలపై పరిశీలన చేశారు. కేంద్రంలో జరిపిన బాలల సంఖ్య తగ్గిపోతుండడంపై అసిస్టెంట్ కలెక్టర్ ప్రశ్నించారు. పిల్లల ఆరోగ్యం, విద్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. వంటగదిలో ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించి సూచనలు చేశారు.

అలాగే హుకుంపేట పిహెచ్‌సి తనిఖీలో మందుల నిల్వలు, రోగులకు వైద్యసేవలు ఎలా అందిస్తున్నారో ఆరా తీశారు. వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించాలని, రోగుల నుంచి ఎటువంటి ఆక్షేపణలు, ఆరోపణలు రాకుండా సేవలు అందించాలని సూచించారు

ముంచంగిపుట్టులో అత్యధిక వర్షం

- 620.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదు

ప్రజాశక్తి -పాడేరు: అల్పపీడన ప్రభావంతో అల్లూరి జిల్లాలో వీడకుండా కురుస్తున్న వర్షాలతో గురువారం జిల్లాలో మొత్తం వర్షపాతం 620.4 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదైంది. సగటున 28.2 మిల్లీమీటర్ల వర్షం కురిసినట్టు అధికారులు వెల్లడించారు. జిల్లాలో అత్యధికంగా ముంచంగిపుట్టు మండలంలో 80.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా పాడేరు మండలంలో 2.4 మిల్లీమీటర్లు వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా మండలాల వారీగా నమోదైన వర్షపాతం వివరాలిలా ఉన్నాయి. ముంచంగిపుట్టు 80.2, హుకుంపేట 46.8, పెదబయలు 41.2, మారేడుమిల్లి 39.4, జి. మాడుగుల 37.4, వై. రామవరం 36.4, చింతూరు 34.6, అరకు వ్యాలీ 32.6, అడ్డతీగల 30.8, చింతపల్లి 28.4,కూనవరం 25.4, గంగవరం 26.6, దేవీపట్నం 24.6, రాజవొమ్మంగి 24.2, వర రామచంద్రపురం 22.2, డుంబ్రిగుడ 20.8. ఎటపాక 18.4, రంప చోడవరం18.2, కొయ్యూరు 16.2, అనంతగిరి 9.2. జికె వీధి 4.2, పాడేరు 2.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

గుడ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన

ప్రజాశక్తి - పెదబయలు : మండలంలోని సీతగుంట పంచాయతీ లకేపుట్టు ఏకలవ్య ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు గుడ్‌టచ్, బ్యాడ్‌టచ్‌పై స్థానిక ఎస్‌ఐ కొల్లి రమణ గురువారం అవగాహన కల్పించారు. గురువారం పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, విద్యార్థినీ, విద్యార్థులు స్నేహితులుగా సోదరభావంతో మెలిగి దేశభక్తి కలిగి ఉండాలని సూచించారు. బాల్యవివాహాల వల్ల కలుగు నష్టాలు, సమస్యలు తెలియజేస్తూ వాటిని ప్రోత్సహించిన వారికి విధించబడే శిక్షలు ఉంటాయని వివరించారు లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ చట్టం, ఫోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు. ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని, పాఠశాలలు, కాలేజీల్లో జూనియర్లపై ర్యాగింగ్ చేయరాదని, అత్యవసర సమయాల్లో బాలికలు గుర్తుపెట్టుకోవాల్సిన టోల్ ఫ్రీ నంబర్లు 112, 100, 1930, 1972పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. తల్లిదండ్రులు ఆశయ సాధన మేరకు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని. పాఠశాల దశలోనే మంచి క్రమశిక్షణతో విద్య విలువలను అభ్యసించాలన్నారు. అనంతరం వసతిగృహంలో పరిశుభ్రత, నాణ్యమైన భోజనం అందుతుందో లేదో విద్యార్థులను అడిగి తెలుసుకున్నామన్నారు కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ అమిత్ ఆనంద్, పోలీసు సిబ్బంది వెంకట్ రావు, రమేష్ పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై అలక్ష్యం వద్దు

- మరణాలను ఉపేక్షించం
- ప్రతి ఒక్కరికీ హెల్త్ కార్డులు
- జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-పాడేరు : గిరిజన విద్యార్థుల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదని సంబంధిత అధికారులందరిపై కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్‌కుమార్ హెచ్చరించారు. ఆశ్రమ విద్యార్థుల ఆరోగ్య పరిరక్షణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విద్యార్థులకు అనారోగ్యం చేస్తే వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్యం అందించాలన్నారు. ఉపాధ్యాయుల నిర్లక్ష్యంతో విద్యార్థుల మరణాలు జరగరాదని సూచించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్య, గిరిజన సంక్షేమం, వైద్యారోగ్య శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. జూమ్ కాన్ఫరెన్సులో ఆశ్రమాలు,గురుకులాల హెచ్‌ఎంలు, పిహెచ్‌సిల వైద్యాధికారులతో సమీక్షించారు.

విద్యార్థుల ఆరోగ్యంపై నెలసరి నివేదిక

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆసుపత్రులు, మందులు అందుబాటులో ఉన్నప్పటికి విద్యార్థుల మరణాలు చోటుచేసుకోవడం సరికాదని మండిపడ్డారు. ఆశ్రమ పాఠశాలల్లో స్కూల్ హెల్త్ కార్యక్రమాన్ని పక్కాగా అమలుచేయాలని ఆదేశించారు. విద్యార్థుల హెల్త్ రికార్డుపై ఉపాధ్యాయులకు, వైద్యాధికారులకు అవగాహన లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసారు. ఆశ్రమ పాఠశాలల్లో ప్రతి నెలా వైద్యశిబిరాలు నిర్వహించాలని, విద్యార్థుల ఆరోగ్యంపై నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. ఆశ్రమాల్లో ప్రతి విద్యార్థికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించేలా వైద్య శిబిరాల నిర్వహణకు సూక్ష్మ కార్యచరణ ప్రణాళికలు తయారు చేయాలన్నారు. ఆర్‌బిఎస్‌కె పుస్తకంలో విద్యార్థి ఆరోగ్య వివరాలు సక్రమంగా నమోదు చేయాలని ఆదేశించారు ఆర్‌బిఎస్‌కె పుస్తకంలో.క్లాస్ టీచర్, వైద్యాధికారి, సూపర్‌వైజరీ అధికారులు సంతకం చేయకపోతే షోకాజ్ నోటీసు జారీ చేస్తామని హెచ్చరించారు. జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో మోనటరింగ్ సెల్ ఏర్పాటు చేయాలని సూచించారు.

నెలాఖరులోగా సికిల్‌సెల్ ఎనీమియా పరీక్షలు

విద్యార్థులకు సికిల్‌సెల్ ఎనిమియా పరీక్షలు నెలాఖరులోగా పూర్తి చేయాలని వైద్యాధికారులను ప్రశ్నించారు. గోమంగి మినీ గురుకులంలో ఎంత మందికి సికిల్‌సెల్ ఎనిమియా స్క్రీనింగ్ చేసారని ఎటువంటి మందులు ఇస్తున్నారని ఆరా తీసారు. సికల్‌సెల్ ఎనిమియా బాధిత పిల్లలకు అదనపు పోషకాహారం అందించాలని ఆదేశించారు. దీనిపై వారి తలిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ఆశ్రమపాఠశాలల్లో సిక్ రూం ఏర్పాటు చేసి, దాని నిర్వహణపై రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు.

హాజరు తక్కువుంటే ఎంఇఒలపై చర్యలు

ఆర్చరీ, రెజ్లింగ్, వాలీబాల్, అథ్లెటిక్స్, కబడ్డీ తదితర ఆటలతో క్రీడా పాఠశాలలు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. 1100 మొబైల్ టవర్లు ఏర్పాటు చేసి కమ్యూనికేషన్ వ్యవస్థను పటిష్టం చేసామన్నారు. సిగ్నల్ అందుబాటులో ఉన్న చోట నుండి బయోమెట్రిక్ హాజరు నమోదు చేయాలన్నారు హాజరు నమోదుకు పాఠశాలలకు సరఫరా చేసిన యంత్రాలను అమర్చి వాటి ద్వారా అటెండెన్సు వేయాలన్నారు. టీచర్ల హాజరును ముగ్గురు పిఐలు పర్యవేక్షించాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు తక్కువగా ఉంటే ఎంఇఒలపై చర్యలుంటాయన్నారు. 4500 మంది విద్యార్థులను పాఠశాలల్లో చేర్పించాల్సి ఉందని, ఐదోతేదీలోగా ఆ ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. టెన్త్ పాసైన విద్యార్థులను జూనియర్ కళాశాలల్లో చేర్పించాలన్నారు. తాగునీటి వనరులు క్లోరినేషన్ చేయాలని పంచాయతీ అధికారులకు ఆ దేశించామన్నారు.

కీటక జనిత వ్యాధులపై అప్రమత్తత

మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమల మందు పిచికారీ సక్రమంగా చేయాలన్నారు. కీటకాలు వ్యాప్తిపై వైద్య సిబ్బంది, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పని చేయాలన్నారు వారపు సంతల్లో వైద్య సేవలు అందించాలన్నారు. మలేరియా నివారణపై అవగాహన కల్పించాలన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశుభ్రంగా ఉంచక పోతే సంబంధిత సిబ్బందిని వెంటనే విధులును తొలగించాలని ఆదేశించారు.అందరి సమన్వయంతో ఆగస్టు నెలాఖరులోగా రెండవ విడత దోమల నివారణ మందు పిచికారీ చేయాలన్నారు.

సీజనల్ వ్యాధుల నివారణకు ముందస్తు కార్యచరణ

జిల్లా వైద్యాధికారి డాక్టర్ టి. విశ్వేశ్వరనాయుడు మాట్లాడుతూ సీజనల్ వ్యాదులు నివారణకు నిర్దేశించిన కార్యచరణ ప్రణాళికలు పక్కాగా అమలు చేయాలన్నారు. క్షేత్రస్థాయి సిబ్బంది అప్రమత్తంగా ఉండి, ప్రతి రోజూ గ్రామాలలో పర్యటించి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

సమావేశంలో రంపచోడవరం పిఒ కె. సింహాచలం, జిల్లా విద్యాశాఖాధికారి పి.బ్రహ్మాజీరావు, గిరిజన సంక్షేమ డిడి ఎల్. రజని, డిసిహెచ్‌ఎస్ డాక్టర్ కె. లక్ష్మి, అదనపు జిల్లా వైద్యాధికారి డాక్టర్ పి.ఎన్ ప్రతాప్, డిటిటి పిఒ డాక్టర్ భారతి, సికిల్‌సెల్ ఎనిమియా నోడల్ అధికారి డాక్టర్ బాజ్జి, డిఎంఒ డాక్టర్ తులసి పాల్గొన్నారు.

మాతా శిశు మరణాల నియంత్రణ లక్ష్యం

వైద్యాధికారులతో సమీక్షలో డిఎంహెచ్‌ఒ డాక్టర్ విశ్వేశ్వరనాయుడు

మాట్లాడుతున్న డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి-పాడేరు: జిల్లాలో మాతా శిశు మరణాలను నియంత్రించేందుకు శ్రద్ధ వహించి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డిఎంహెచ్‌ఒ డాక్టర్ టి విశ్వేశ్వరనాయుడు సూచించారు గురువారం మాతా శిశు మరణాలపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సమీక్ష సమావేశంనిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గర్భిణులకు క్రమం తప్పకుండా అందించే వైద్య సేవలు అందించాలన్నారు. ప్రతినెలా 9న గర్భిణులకు వైద్యఆరోగ్య పరీక్షలు నిర్వహించి, క్రిటికల్ కండిషన్‌లో ఉన్న వారిని ప్రత్యేక వైద్యసేవలు అందించేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా పౌష్టిక ఆహారం అందించాలని, కిల్కారి కాల్స్ ద్వార గర్భవతులకు బాలింతలకు అవగాహన కల్పించాలని సూచించారు. ప్రసవించే తేదికి వారం రోజులు ముందు దగ్గర్లో ఉన్న ప్రసూతి నిరీక్షణ కేంద్రానికి తరలించాలని సూచించారు. 108 102 వాహన సేవలను వినియోగించుకోవాలన్నారు. క్షేత్ర స్థాయి సిబ్బంది విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖా పరమైన కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏయిడ్స్, కుష్టు, క్షయ వ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ ఎం.కిరణ్ కుమార్, డిఐఒ డాక్టర్ కమల కుమారి, ప్రభుత్వాసుపత్రి గైనకాలజిస్ట్ డాక్టర్ పి.సృజన, జిల్లా డిపిహెచ్‌ఎన్‌ఒ జి. బులోకమ్మ, పలు పిహెచ్‌సిల వైద్యాధికారులు, సిబ్బంది పాల్గున్నారు.

ఉత్సాహంగా 'సుపరిపాలనకు తొలి అడుగు'

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని కొట్నాపల్లి గ్రామంలో 'సుపరిపాలనలో తొలి అడుగు" కార్యక్రమం రెండో రోజు గురువారం ఉత్సాహంగా కొనసాగింది. ఎపిఎస్‌ఆర్‌టిసి విజయనగరం జోన్ ఛైర్మన్, సియ్యారి దొన్ను దొర, జిసిసి ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ పాల్గొని .ఇంటింటికీ వెళ్లి, ప్రజలతో ఆప్యాయంగా మమేకమవుతూ, కూటమి ప్రభుత్వం ఏడాది కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా వారికి ి గ్రామస్థులు సాంస్కృతిక, సాంప్రదాయ పద్ధతుల్లో స్వాగతం పలికారు.

.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పెంచిన పింఛన్లు సజావుగా పంపిణీ, ఇతర పథకాలపై ప్రజల నుంచి సానుకూల స్పందన లభించిందని, ప్రతి గడపలోనూ కూటమి పాలనపై సంతృప్తి వ్యక్తమవుతోందనిన్నారు. గిరిజన ప్రాంతాల్లో రహదారులేని గ్రామాలకు రోడ్లు వేయడంతో ప్రభుత్వంపై సానుకూల దృక్పథం ఏర్పడిందన్నారు.కార్యక్రమంలో టీడీపీ నేతలు, కార్యకర్తలు, గ్రామస్తులుపాల్గొన్నారు.

ముమ్మర వాహన తనిఖీలు

ప్రజాశక్తి-చింతపల్లి: చింతపల్లి ప్రాంతంలో అనుమానితులు సంచరించకుండా ముందస్తు చర్యలు తీసుకోవడం జరిగిందని ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు. ఎస్పి అమిత్ బర్దర్ ఆదేశాలతో, చింతపల్లి డిఎస్‌పి నవజ్యోతి మిశ్రా సూచనల మేరకు సిఐ వినోద్ బాబు పర్యవేక్షణలో కట్టుదిట్టమైన భద్రతా చర్యలు అమలు చేస్తున్నట్లు తెలిపారు.

రాకపోకల కష్టాలపై ఉన్నతాధికారులకు నివేదిక

- 'ప్రజాశక్తి' కథనంతో కదిలొచ్చిన అధికార యంత్రాంగం
- ఎర్నాపల్లి వద్ద వాగు పరిస్థితి పరిశీలన

ప్రజాశక్తి-చింతపల్లి

మండలంలోని మారుమూల ఎర్రవరం, ఎర్నాపల్లి వాగు పొంగి ప్రవహిస్తుండటంతో నిత్యావసర సరుకులు తెచ్చుకోవడానికి గిరిజన మహిళలు ప్రాణాలను ఫణంగా పెట్టి వాగు దాటాల్సి వస్తోందని 'ప్రజాశక్తి'లో వెలుగులోకి తెచ్చిన కథనంపై అధికార యంత్రాంగం వెంటనే స్పందించింది. పరిస్థితిని సమీక్షించేందుకు పరుగులు తీశారు. వాగు ప్రాంతాన్ని మండల రెవెన్యూ సిబ్బంది సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. స్థానికులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాగు పరిస్థితులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు చేపట్టేందుకు నివేదిక ఇవ్వనున్నట్లు వెల్లడించారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. వాగు వద్ద హెచ్చరికగా రెడ్ రిబ్బన్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వాగు వద్ద శాశ్వత పరిష్కారంగా వంతెన ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా అధికారులకు స్థానికులు మొరపెట్టుకున్నారు.

వాగు వద్ద పరిస్థితులను పరిశీలిస్తున్న అధికారులు

రాత్రి వేళల్లో సంచరించొద్దు

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండల కేంద్రంలో ఇటీవల తరచుగా దుకాణాల్లో దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో అర్ధరాత్రి దాటి తర్వాత ఎవరైనా వ్యక్తులు, వాహనచోదకులు సంచరించరాదని ఎస్‌ఐ జె.రామకృష్ణ సూచించారు. రాత్రి 11 గంటలు దాటిన తర్వాత ఎవరూ అనవసరంగా ఎవరు రోడ్లపై సంచరించరాదన్నారు. మండల కేంద్రంలో ఇటీవల దొంగతనాల నేపథ్యంలో రాత్రి వేళలో పోలీస్ గస్తీతో పాటు , పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తామన్నారు.

ఘనంగా ఇండియన్ క్రిస్టియన్ డే

ప్రజాశక్తి-చింతపల్లి: ఇండియన్ క్రిస్టియన్ దినోత్సవాన్ని స్థానిక క్రైస్తవులు ఘనంగా నిర్వహించారు. హనుమాన్ జంక్షన్ కూడలి నుండి పాత బస్టాండ్ వరకు క్రైస్తవ మతస్తులకు రక్షణ కల్పించాలని, మత బలోపేతానికి ప్రజలు సహకరించాలని కోరుతూ భారీ ర్యాలీ నిర్వహించారు. తరువాత చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి కేక్ కట్ చేశారు. క్రైస్తవులు ఒకరికి ఒకరు కేక్ తినిపిస్తూ వేడుక జరుపుకున్నారు. అనంతరం స్థానిక ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేసి క్రైస్తవులు తమ సామాజిక బాధ్యతను చాటుకున్నారు. కార్యక్రమంలో పాస్టర్లు, క్రిస్టియన్ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం పట్టివేత

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రాజవొమ్మంగి నూకలమ్మ గుడి వీధిలో అక్రంగా నిల్వ చేసిన రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు గురువారం పట్టుకున్నారు. 247 కేజీల రేషన్ బియ్యం రాజవొమ్మంగి చెందిన ఒక వ్యక్తి ఇంట్లో ఉన్నట్లు సమాచారం మేరకు దాడి చేసి పట్టుకున్నట్లు తహశీల్దారు ఎ.సత్యనారాయణ తెలిపారు. ఈ బియ్యాన్ని బియన్ జిసిసి గోడానికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

పొంచి ఉన్న ప్రమాదం

- చీడిపుట్టు కాజ్‌వేపై భారీ రంధ్రం
- ఆదమరిస్తే ప్రమాదం ఖాయం
- పట్టించుకోని అధికారగణం

ప్రజాశక్తి-హుకుంపేట: మండలంలోని చీడిపుట్టు కాజ్‌వేపై ప్రమాదం పొంచి ఉంది. ఇటీవల కురిసిన వర్షాలకు కాజ్‌వే మధ్యభాగంలో పెద్ద రంధ్రం ఏర్పడింది. దశాబ్దాల క్రితం నిర్మించినఈ కాజ్‌వే ఇప్పటికే కాలం చెల్లిపోవడంతో శిధిలావస్థకు చేరి ప్రమాదకరంగా మారింది. చిన్న రంధ్రంగా ప్రారంభమైన బీటలు ఏర్పడడం, తర్వాత వరుసగా కురిసిన వర్షాల ధాటికి రంధ్రంపెద్దదై, , ఇప్పుడు వాహనదారులకు ముప్పుగా మారింది. ఈ కాజ్‌వే మీదుగా గాడికించు మండ, అడ్డుమండ, భారమాసి, మొదపుట్టు తదితర పంచాయతీల ప్రజలు రోజూ వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాలు తీవ్రత పెరిగితే, కాజ్‌వే వద్ద వాగు ఉధృతి పెరిగి ప్రమాదతీవ్రత మరింత ఎక్కువయ్యే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. భారీ . వాహనాల రాకపోకలతో పరిస్థితి మరింత దయనీయంగా మారి, ఎప్పుడైనా పూర్తిగా కూలిపోయే ప్రమాదం ఉందని, ఇటువంటి పరిస్థితుల్లో దీని ప్రయాణం ప్రాణసాహసమేనని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, ఈ కాజ్‌వేను అత్యవసరంగా మరమ్మతులు చేయించి, తాత్కాలికంగా ప్రమాదాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని, అలాగే కాజ్‌వేపై రంధ్రం మరింత పెద్దది కాకుండా చూడాలని కోరుతున్నారు.

చీడిపుట్టు కాజ్‌వేపై ఏర్పడిన భారీ రంధ్రం

రహదారి నిర్మాణం కోసం వినతి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : మండలంలోని జె.అన్నవరం, గొంటివానిపాలెం, ఏలేశ్వరం రహదారి నిర్మించాలంటూ ఎపి ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు లోతా రామారావు, మండల కార్యదర్శి కొండ్ల సూరిబాబు గురువారం రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవికి వినతిపత్రం అందజేశారు. గురువారం రాజవొమ్మంగి వచ్చిన ఎమ్మెల్యే శిరీష దేవిని వారు కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారి అధ్వానంగా ఉండడంతో ఈ మార్గంలో వాహనదారులు, ప్రయాణికులు నరకం చూస్తున్నారని, ముఖ్యంగా గర్భిణులు స్కానింగ్‌లకు ఏలేశ్వరం వెళ్లినప్పుడు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అత్యవసర కేసులు రిఫర్ చేస్తే ఈ రహదారిలోనే సగం సమయం వృథా అయిపోతుందన్నారు. ఏజన్సీ ఎమ్మెల్యేగా ఈ సమస్యపై దృష్టి సారించి రహదారి నిర్మాణాన్ని కృషి చేయాలని కోరారు. దీనికి స్పందించిన ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి మాట్లాడుతూ ఐటీడీఏ నిధులతో సిసి రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు పంపడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో పలువురు గిరిజన సంఘం నేతలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు

3, 4, 5 తరగతులను పునరుద్ధరించాలి

విద్యాశాఖ సభ్యులకు సమస్యను వివరిస్తున్న స్థానికులు

ప్రజాశక్తి-రంపచోడవరం : మండల కేంద్రం రంపచోడవరం ఎన్‌టిఆర్ కాలనీలో ఉన్న మండల పరిషత్తు ప్రాథమిక పాఠశాలలో 3, 4, 5 తరగతులను పునరుద్ధరించాలని ఆ గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. అమరావతి నుండి వచ్చిన విద్యాశాఖ రాష్ట్రస్థాయి సభ్యులు మల్లిఖాసర్జునరావు, సంధ్య, కోటేశ్వరరావు తదితరులు గురువారం ఎంపిపి పాఠశాలను సందర్శించారు. పాఠశాల భవనాలు, తరగతి గదులు, విద్యార్థుల ఇన్‌రోల్‌మెంట్, ఉపాధ్యాయుల పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ గతంలో తమ పాఠశాలలో 1 నుండి 5వ తరగతి వరకు ఉండేదని, స్కూల్ మేనేజ్ మెంట్ కమిటీ తీర్మానం లేకుండా ఏకపక్షంగా 3, 4, 5 తరగతులను హైస్కూల్‌లో కలిపేశారని తెలిపారు. దీంతో తమ పిల్లలు 1.5 కిలో మీటరు దూరంలో ఉన్న హైస్కూల్‌కు బస్ కాంప్లెక్, అంబేద్కర్ సెంటర్ మీదుగా ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న రోడ్డు దాటవలసి వస్తుందని పేర్కొన్నారు. ఈ సమయంలో తమ పిల్లలకు ఏమవుతుందోనని తాము భయభ్రాంతులకు గురవుతున్నామని తెలిపారు. దారిలో కోతులు దాడి చేయటం, వీధి కుక్కలు ఎక్కువగా ఉండటం కూడా తమను భయాందోళనకు గురి చేస్తుందని చెప్పారు. ఈ విషయమై తాము జిల్లా కలెక్టర్‌కు ఐటిడిఎ ప్రాజక్టు అధికారికి, జిల్లా విద్యాశాఖాధికారికి తెలియచేశామని స్కూల్ కమిటీ చైర్‌పర్సన్ కె.ప్రియాంక, వైస్ చైర్‌పర్సన్ పి.భాగ్యలక్ష్మి, మాజీ ఉపసర్పంచ్ కెఎల్‌ఎన్.గురుప్రసాద్ తెలిపారు. తమ విన్నపాన్ని పరిశీలించి 3, 4, 5 తరగతులను తమ ప్రాంతంలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో పునరుద్ధరించాలని కోరారు. దీనికి ఆయన సానుకూలంగా స్పందించారు. ఆయన వెంట స్థానిక సిఆర్‌టిలు వెంకటేష్, వెంకన్న దొర ఉన్నారు.

పలుచోట్ల జెకెసి ట్రస్టు సేవలు

ప్రజాశక్తి-చింతూరు : మండలంలోని ఏడుగురాళ్లపల్లి పంచాయతీ అల్లివాగు గ్రామంలో ప్రభుత్వ పాఠశాలకు షెడ్డు నిర్మాణానికి అవసరమైన సామాగ్రిని జమాల్ ఖాన్ ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన అందజేశారు. ఈ పాఠశాలకు సరైన భవనంలేని కారణంగా గిరిజన విద్యార్థులు ఎండకు వానకు ఇబ్బందులు పడుతున్నారని ఉపాధ్యాయులు సవలం చైతన్య గత వారంలో ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జెకెసి ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్ విన్నవించారు. పాఠశాల భవనం ఏర్పాటుకు సహాయం చేయాలని ఆ వినతిలో కోరారు. దీనికి స్పందించిన జమాల్ ఖాన్ పాఠశాల నిర్మాణానికి కావలసిన సిమెంటు రేకులు, ఇనుప పైపులను గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షులు ఎండి జహంగీర్, విఆర్.పురం మాజీ జడ్పిటిసి ముత్యాల రామారావు, మామిడి రమణ, మాజీ సర్పంచ్ సోడే శ్రీనివాసరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ సభ్యులు పి సాల్మాన్ రాజు. ట్రస్ట్ సభ్యులు అబ్దుల్ వహీద్, ఎండి అబ్రార్ ఖాన్, మహబూబ్ పాషా, నటరాజ్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి చేయూత

ఎటపాక : మండలంలోని గుండాల గ్రామానికి చెందిన కొత్తపల్లి సంతోష్ ఇల్లు అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమై కుటుంబం రోడ్డు పడింది. విషయం తెలుసుకున్న ఆయుర్వేద వైద్యులు, జెకెసి ట్రస్ట్ చైర్మన్ జమాల్ ఖాన్ గురువారం గుండాల గ్రామానికి స్వయంగా వెళ్లి పరిశీలించి ఇంటి నిర్మాణానికి కావాలసిన సిమెంట్ రేకులు, ఇనుప పైపులు అందజేశారు. ఈ కార్యక్రమం లో గ్రామస్తులు నాలాజాలా మధు, రసూల్, కణితి మధు, ట్రస్ట్ సభ్యులు మహబూబ్ పాషా, యకూబ్ పాల్గొన్నారు.

విఆర్.పురం : కూనవరం మండలం గండి కొత్తగూడెం గ్రామానికి చెందిన తెల్లం వెంకయ్య అనే ఆదివాసీ గిరిజనుడు ఇల్లు అగ్ని ప్రమాదానికి గురై కాలిపోయింది. బాధితులు జమాల్ ఖాన్‌ను సంప్రదించారు. వెంటనే తన ట్రస్ట్ ద్వారా గురువారం ఇంటి నిర్మాణానికి కావలసిన సిమెంటు రేకులు, ఇనుప పైపులను వెంకయ్యకు గ్రామ పెద్దల సమక్షంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండలాధ్యక్షులు ఎండి జహంగీర్, మార్కెట్ కమిటీ సభ్యులు పి సాల్మన్ రాజు, విఆర్ పురం మాజీ జడ్పిటిసి ముత్యాల రామారావు, మామిడి రమణ, సూఫీ పాల్గొన్నారు.

పశువులను కట్టడి చేయాలని దండోరా

ప్రజాశక్తి-వై.రామవరం : మండలంలో పలు గ్రామాలలో పశువులను కట్టడి చేయాలంటూ గురువారం పంచాయతీల సిబ్బంది దండోరా వేయించారు. వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయని పశువులు పంటలు పాడు చేస్తాయని, వాటిని ఇండ్ల వద్దనే కట్టుకోవాలని ఎంపీడీవో బాపన దొర ప్రచారం చేయించారు. జనవరి నుంచి పశువులను వదిలేయడంతో గ్రామాలలో పశువులు రోడ్లపైనే ఉండటం వలన, అనేకమంది ప్రయాణికులు రోడ్డు ప్రమాదాలకు గురయ్యారు. మండలంలో దేవరమడుగులు, గ్రామం నుంచి వై రామవరం వరకు గ్రామాల్లో రాత్రి సమయంలో పశువులు రహదారులపై ఉండటం వలన ప్రమాదాలు జరుగుతున్నాయని ఇకపై పశువులను యజమానులు వాళ్ల ఇంట్లో వద్దనే కట్టుకోవాలని దండోరా వేయించారు. లేనియెడల రైతులకు రూ.500 జరిమాన వేస్తామని హెచ్చరించారు.

మాంసం, చేపల విక్రయాలు నిలుపుదల చేయాలి

ప్రజాశక్తి-వై.రామవరం : వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న కారణంగా వై.రామవరం మండలంలో అన్ని గ్రామాల్లో మాంసం విక్రయాలు నిలుపుదల చేయాలని పంచాయతీల సిబ్బంది వ్యాపారస్తులకు ఆదేశాలు చేసినట్లు ఎంపీడీవో బాపన్న దొర తెలిపారు. కలెక్టర్ ఉత్తరుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు. భారీ వర్షాలు కురుస్తున్న సందర్భంగా డమేరియా వంటి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ముందస్తున చర్యలు భాగంగానే గ్రామాలలో మాంసం చేపలు విక్రయాలు నిలుపుదల చేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ ఆదేశాలను ధిక్కరించిన ఎడల ప్రభుత్వం తీసుకునే చర్యలకు బాధ్యతలు అవుతారని హెచ్చరించారు.

రైతులకు విత్తనాల పంపిణీ

ప్రజాశక్తి-కూనవరం : మండలంలోని పెద్ద ఆర్యూర్ గ్రామపంచాయతీ పరిధి ఆర్యూర్ గ్రామంలో సచివాలయం వద్ద గురువారం రైతులకు స్థానిక సర్పంచ్ నాగమణి, ఎంపీటీసీ అమ్మాజీ చేతుల మీదుగా పంపిణీ చేశ్వారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు, గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి ఐదు కోతులు మృతి

ప్రజాశక్తి-సీలేరు : విద్యుత్ షాక్‌కు గురై ఐదు కోతులు మృత్యువాతకు గురయ్యాయి. జీకే వీధి మండలం సీలేరు మేజర్ పంచాయతీ పరిధిలో కోతులు గుంపులు గుంపులుగా ఏర్పడి ఏపీ జెన్కో కాలనీ, మార్కెట్, దుర్గా వీధి, సిపిహెచ్ క్యాంపు తదితర ప్రదేశాల్లో విద్యుత్ వైర్లు, టెలిఫోన్ వైర్లపై తిరుగుతూ ప్రతిరోజు అలజడి సృష్టిస్తున్నాయి. ఈ క్రమంలో సిపిహెచ్ క్యాంపు సమీపంలో గన్నేరు చెట్టుపై గురువారం కోతులు సంచరిస్తున్న సమయంలో విద్యుత్ వైర్లు ప్రమాదవస్తు చెట్టు కొమ్మలకు తాకడంతో విద్యుత్ షాక్ గురై పిల్లలతో సహా ఐదు కోతులు మృతి చెందాయి. ప్రమాదం జరిగిన పరిసర ప్రాంతాల ప్రజలు గమనించి గ్రామపంచాయతీ సర్పంచ్ దుర్జోకు సమాచారం అందించారు. పంచాయతీ పారిశుధ్య సిబ్బంది ద్వారా గొయ్యి తీసి వాటిని పూడ్చిపెట్టారు.

కార్యకర్తలు ఐక్యంగా పని చేయాలి

ప్రజాశక్తి-సీలేరు : కార్యకర్తలంతా గ్రూపు రాజకీయాలకు స్వస్తి పలికి ఐకమత్యంగా ఉంటే రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ ఘన విజయం సాధిస్తుందని టిడిపి మండల పరిశీలికులు తమ్ముడు సుబ్బారావు పేర్కొన్నారు. గురువారం మండల అధ్యక్షులు ముక్కల మహేష్ అధ్యక్షతన జీకే వీధి మండలం సీలేరు, దారకొండ, గుమ్మిరేవులు, దుప్పిలివాడ పంచాయతీల పరిధిలో కొత్త గ్రామ కమిటీలను నియామక కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. సీలేరులో నూతన గ్రామ కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా ఎస్‌కె నాగూర్ మీరా, కార్యదర్శిగా బండారు మారిబాబు, ఉపాధ్యక్షుడిగా కే కాశి, కార్యనిర్వాహక కార్యదర్శిగా పి కృష్ణ, కోశాధికారిగా ఎన్‌వివి శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులుగా కిముడు నీతూ, కిల్లో భగవాన్, పెట్ల కృష్ణ, జీపి లోన్, ఈ నాగేంద్రబాబు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జీకే వీధి ఎంపీటీసీ పసుపులేటి నాగమణి, మండల తెదేపా నాయకులు కొర్ర బలరాం, పసుపులేటి రామకృష్ణ, చిటికెల రాము, బొర్రా కృష్ణ, ఎన్ తిరుమలరావు, సన్యాసిరావు, ఉప సర్పంచ్ కే వల్లి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలో తాగునీటి పథకం నిర్మాణం

ప్రజాశక్తి-కొయ్యూరు : కొయ్యూరు మండలం మఠం భీమవరం పంచాయతీ మారుమూల గ్రామమైన జ్యోతులమామిడిలో త్వరలో తాగునీటి పథకం నిర్మాణ పనులు చేపడతామని ఆర్డబ్ల్యూఎస్ జేఈ సాయికృష్ణ తెలిపారు. ఈ మేరకు గురువారం ఆయన జ్యోతులమామిడి గ్రామంలో పర్యటించారు. గ్రామానికి మంజూరైన తాగునీటి పథకానికి సంబంధించి స్థల పరిశీలన చేశారు. భారీ వర్షాన్ని సైతం లెక్కచేయకుండా గ్రామంలో పర్యటించిన ఆయనకు యూ.చీడిపాలెం సర్పంచ్ దడల రమేశ్, గ్రామస్థులు కృతజ్ఞతలు తెలిపారు.